

# ఆయురారోగ్య అయిశ్వర్యాభి సిద్ధ్యర్థం

-గంటి భానుమతి

ఆదివారం.

ఉదయం. టైము ఎనిమిది దాటింది.

స్టిములెంట్, స్ట్రాంగ్ కాఫీ తాగుతూ, తీరిగ్గా పేపరు చూస్తున్నాను.

యింట్లోనే వాకింగ్, ఆ బాల్కని నుంచి ఈ గది వరకూ చేస్తోంది లీల.

పొట్టిగా ఓవర్ వెయిట్‌తో, ఎరుపు రంగు కుర్తామీద నల్ల చున్నీని ఓ భుజం పైనుంచి లాగి, నడుము చుట్టూ చుట్టింది.

నెత్తిన తెల్లటి బొచ్చు తువ్వాలి వుంది. అంటే తలకి హాట్ ట్రీట్‌మెంట్ యిస్తోంది. ఆదివారం దినచర్యలో ఓ భాగం అది.

అలా అటూ, యిటూ పచార్లుచేస్తున్న ఆమెను చూస్తూంటే సెయింట్ షెలీనాలో నెపోలియన్ యిలాగే పచార్లు చేసి ఉంటాడు అని అనిపించింది.

అయితే ఒక్కటే తేడా సెయింట్ షెలీనా ఓ చిన్న ద్వీపం. అందులో కొండలు, రాళ్ళు తప్ప మరేం లేదు.

నెపోలియన్ నాకు యిష్టమని, నా మోడల్ అని నేను అనుకోను. కానీ, ఎలాంటి వాళ్ళకయినా, ఎలాంటి దానికైనా ఫుల్‌స్టాప్ ఉంటుందన్న చిన్న ఫిలాసఫిని బోధించే వాటర్‌లూ మాత్రం నచ్చింది.

నడుస్తున్న నెపోలియన్‌ని 'యువర్ మెజెస్టీ'అని సంబోధించ కుండా 'జనరల్' అని సంబోధించి డిస్టర్బ్ చేసినట్లుగా నా పేపర్ రీడిం గ్‌కి ఆటంకం కలిగించింది టపీమని పడ్డ ఓ పుస్తకం.

తల ఎత్తి చూసాను. లీల.

బొచ్చు తువ్వాలు తీసేసింది. జుట్టుని వదిలేసింది.

స్వేద బిందువులు నుదుటి మీద, ముక్కు మీద, చెంపల దగ్గర ముత్యాల్లా మెరిసిపోతున్నాయి.

కళ్ళెగరేసాను ఏంవిటన్నట్లు.

ఏం మాట్లాడకుండా పుస్తకాన్ని యింకొంచెం ముందుకు తోసింది.

పుస్తకం వైపు చూసాను.

సింబాలిక్ ఫెంగ్‌షుయ్ అమేజింగ్ క్రిస్టల్స్.

పూర్తిగా అర్థంకాకపోయినా, క్రిస్టల్స్ అన్న పదం చదవగానే ఏదో జ్యోతిష్యం, దానికి సంబంధించిన పుస్తకం అయి ఉంటుందనిపించింది.

కాస్త భయపడ్డాను.

అయినా అర్థం కానట్లు ఏంవిటన్నట్లు సైగ చేసాను.

మనోహరంగా నవ్వింది. నలభై దాటినా చెదరని అందం.

అదిగో... ఆ నవ్వే నన్ను కట్టి పారేస్తోంది.

"ఆయురారోగ్యాలతో, అష్టయిశ్వర్యాలతో మన మంతా తుల తూగుతూ ఉండాలంటే ఏంచెయ్యాలో..."

కిందటి వారం వరకు జ్యోతిష్యులు, కనసల్టేషన్‌లు, జాతిరాళ్ళు గ్రహశాంతులు. ఉంగరాలు అంటూ కొన్ని వేలు ధారపోసింది. అందులోంచి యింకా పూర్తిగా తేరుకోనే లేదు... యిప్పుడు...

"ఏం కొనాలో కూడానా..." వ్యంగ్యంగా అన్నాను.

> **ఓ యాభై రూపాయల్లో యింట్లో శాంతిని, ఆరోగ్యాన్ని, ఆయుష్షుని ప్రసాదించడానికి కంకణం కట్టుకున్న ఆ రచయితని మనస్ఫూర్తిగా అభినందించాను. మంచి మార్కెటింగ్ సెన్స్. లక్ష కాపీలమ్ముడుపోయి ఉంటాయి.**

"ఆబ్వియస్‌లీ..." భుజాలెగరేస్తూ తలని ఓవైపుగా వాల్చి అంది.

గుండెల్లో రాయి.

"మరి మొన్నటివరకూ చేయించిన శాంతులు, కొన్న రాళ్ళూ అవీ... వాటికేం పవర్ లేదా!..."

"ఇది వేరు. ఇది చైనా వాళ్ళ శాస్త్రప్రకారంగా యింట్లో సుఖశాంతులు, భోగ భాగ్యాలతో... యిల్లు తుల తూగే విధానం..."

"చీటింగ్, ఫ్రాడ్ లేదా నెట్ ద్వారా... బ్లాక్ హాకర్ యిలా అన్ని చైనా వాళ్ళ ప్రకారంగా..."

టపీమని నెత్తిన కొట్టి, ఓ కుర్చీ లాక్కుని కూచుంది.

"ఛ! మీకు చైనావాళ్ళ గురించి తెలీదు... అంత చీప్‌గా మాట్లాడకండి. వాళ్ళు కమ్యూనిస్టులు. వాళ్ళ పద్ధతులు వేరు..."

లోపలి పేజి తిప్పి చూసాను. ధర యాభై రూపాయలు.

ఓ యాభై రూపాయల్లో యింట్లో శాంతిని, ఆరోగ్యాన్ని, ఆయుష్షుని ప్రసాదించడానికి కంకణం కట్టుకున్న ఆ రచయితని మనస్ఫూర్తిగా అభినందించాను. మంచి మార్కెటింగ్ సెన్స్. లక్ష కాపీలమ్ముడుపోయి ఉంటాయి.

కాఫీ బాగా పనిచేసింది.

ఉత్సాహంగా లీల వైపు చూసాను.

"ఇంతకీ యిందులో ఉన్నదేంవిటీ?"

"ఏ వస్తువు ఎక్కడ పెడ్తే ఏ రకంగా యింట్లో శాంతి ఉంటుందో, సంతోషం ఉంటుందో..."

"మా అమ్మ కూడా యిదే చెప్పేది కదా... నీకు..."

"సరే లెండి... మీ అమ్మగారిదే చెప్పుకోవాలి. ఆవిడ కంతా చాదస్తం..."

"అదేలే... అవ్వ పేరే ముసలమ్మ..."

"ఇదే నాకు నచ్చదు. ప్రతీ దానికి నెగెటివ్... ఆ ఏటిట్యూడ్ మంచిది కాదు... ఆర్గ్యూ చేస్తారు..."అంటూ కుర్చీని బర్రున వెనక్కి తోసింది.

ఆమె కోమలమైన భావాలకి బాధ కలిగించదల్చుకోలేదు.

"అది కాదు... ముందు కూచో... లీలా... కూచో... లీలా..." ఆగిపోయింది లీల.

"ఆగండి... అక్కడ... ఆగండి... ఫర్ యువర్ ఇన్‌ఫర్మేషన్... నా పేరు లీల కాదు... లీ... ఇవ్వాళ నుంచి లీ..." అంది తీవ్రంగా.

"లీ!... అదేం పేరు... బ్రూస్‌లీ లాగా..." మొహం ఒక్కసారి వెలిగింది.

"య్యెస్... యూ గాటిట్..." అంటూ చిటిక వేసి చూపుడు వేలుని నా ముందుంచింది.

వింతగానే ఆమెనే చూస్తున్నాను.

"లీ... చైనా వాళ్ళ పేరు... అలా 'లీ'అని అంటూంటే ఓ ఎనర్జీ అలా ఒంట్లోకి ప్రవహిస్తోంది. ఏదీ... మీరు కూడా అనండి... లీ... లీ... ఓలాంటి వైబ్రేషన్స్ వ్యాపిస్తున్నాయి...కదా!..."అంది నావైపు ఉత్సాహంగా చూస్తూ.

చుట్టూ చూసాను. కనపళ్ళేదు. "ఎక్కడా?"

"హుం... బేసిక్ సైన్స్ తెలీదా! వైబ్రేషన్స్ ఎక్కడైనా

కనిపిస్తాయా? అది ఓ ఫీలింగ్. యాబ్‌స్ట్రాక్ట్. అనుభవించాలి." తన్మయంగా చెప్పుకుంటూ పోతుంది.

నోరు తెరుచుకుని లీలనే చూస్తూండి పోయాను.

నా మొహం చూసి టక్కున ఆగింది.

"నాకు తెలుసు, మీలో నెగెటివ్ ఆలోచనలు వచ్చేస్తున్నాయి. అది ఈ ఫెంగ్‌షుయ్‌లో మంచిది కాదు. నకారాత్మకమైన ఆలోచనలు అసలుండకూడదు. దాన్ని మనసులోంచి తీసెయ్యండి. అంతా సకారాత్మకమైన ఆలోచనలే ఉండాలి..."

ఓసారి గదిలోకి వెళ్ళి ఓ బాగ్ తీసుకొచ్చింది. 'లీ'.

"ఇదిగో ఈ పుస్తకాలు, సింబల్స్, బొమ్మలు కొన్నాను. ఈ పుస్తకాల్లో మన సమస్యలు సందేహాలకి సమాధానాలుంటాయి. యింట్లో అంతా ఆనందంగా ఆరోగ్యంతో, బోల్డు డబ్బుతో ఉండడానికి ఏం చెయ్యాలి? ఎలా చెయ్యాలి? అన్ని ఉన్నాయి."

సంబరపడ్డాను డబ్బు విలువ తెలిసిందని.

రోగాలు రొచ్చులు, డాక్టర్లు మందులు... ఖర్చే లేదు.

కానీ నా సంబరం ఎంతో కాలం నిలవలేదు. మొదట్లో డబ్బు అడిగి తీసుకునేది. ఆ తర్వాత అడగడం మానేసింది. తీసుకోడం మొదలెట్టింది.

"లాఫింగ్ బుద్ధాలు, అవి అదృష్టం తెస్తాయి", పెద్ద పొట్టతో ఉన్న ఆకారాల్ని వివిధ పోజుల్లో ఉన్నది ముందు గదిలో ఉంచి నాకు చూపించింది.

నాకు తెలిసిన బుద్ధా తపస్సు చేసుకునే బుద్ధా... కానీ ఈ నవ్వే బుద్ధా..."

"పర్సు నిండా డబ్బుండాలి. డబ్బే డబ్బు... డబ్బుకి లోటుండదు." అంటూ మూడు చిల్లి కానీ ల్లాంటి చైనా బిళ్ళల్ని ఓ ఎర్ర తాడుకి కట్టి పర్సులో ఉంచింది.

ఓ రోజున ఓ గాజు జాడి దాన్లో బంగారు రంగు చేపలు వేసి గుమ్మం పక్కన కిటికి పక్కగా పెట్టింది.

ఓ రోజు యథాప్రకారంగా తొమ్మిదింటికి, తలుపు తీసుకుని వచ్చిన నాకు గుమ్మం పక్కనే ఏదో నల్లగా కనపడింది.

హడలి పోయాను మండ్రగబ్బలాంటి దేవయినా అని ఒంగి చూసాను.

అదో కప్ప. దాని నోట్లో రూపాయి బిళ్ళ- చేత్తో ముట్టుకోబోయాను.

ఈ లోపల 'లీ' వచ్చింది.

"ఆఁ... ఆఁ..." దాన్నలాగే ఉంచండి. అది అక్కడే ఉండాలి అని బుక్కులో రాసి ఉంది.

ప్రతీసారి ఏదో ఒకటి ఓ కల్పవృక్షం ఓ ద్రాక్ష పళ్ళ గుత్తి, ఏదో చార్ట్‌లు.

ఓ ఆదివారం పొద్దున్నే... "ఇలా రండి... ఈ విండ్ ఛైమ్స్‌ని ఈ నార్త్ వెస్ట్ కార్నర్‌లో తగిలించండి... ఇది చాలా మంచిది. ఎంతో అదృష్టాన్ని తెస్తుంది. ఈసారి ఏడు గొట్టాలున్నది కొంటాను. దాన్ని పడమర వైపు పెట్టామనుకోండి యింక మన పిల్లలిద్దరికీ మంచి అదృష్టం. దానికి ఎంసెట్‌లో మంచి రాంక్ వస్తుంది. పెద్దవాడికి 'గేట్'లో మంచి స్కోరు వస్తుంది.

"ఇన్ని కొన్నావు కదా... నీకేవయినా మార్పు కనపడుతోందా!" తీవ్రంగా చూసింది.

"వ్యంగ్యమా!"

తడబడ్డాను.

"ఎలా వస్తుంది మార్పు? ఎలా కనిపిస్తుంది మార్పు? చెప్పండి. నెగెటివ్ ఫోర్స్‌లు లోతుల్లోకి చొచ్చుకుపోయి ఉన్నాయి. అవి అంత తొందరగా బయటికి పారిపోతాయా! కూకటి వేళ్ళతో లాగి తీసేయడానికి, యంగ్ పాజిటివ్‌గా ఈ యింట్లో ఉండడానికి సమయం పడ్తుంది. ఇదేమైనా మాంత్రికుడి దండమా! హాం హూం ఫట్ అని తిప్పేయగానే మార్పులు జరిగిపోవడానికి."

నా దగ్గర జవాబేం లేదు. ఆమె లాజిక్ అర్థం అయింది. వాదించడం నా మూర్ఖత్వం. అడ్డుకోడం వెర్రితనం.

ప్రపంచం అంతా చైనా వస్తువులకి, బట్టలకి, బొమ్మలకి, ఏ బిజినెస్ స్కూలుకి అంతు చిక్కని వాళ్ళ తెలివికి, టాక్టిక్స్‌కి సలాము చేస్తూంటే ఈ లీల ఎంత!... నేనెంత! అర్భకుణ్ణి... కొండని 'ఢీ'కొనడం అవివేకం... సరెండర్ కాక తప్పలేదు.

ఇంతవరకూ బతికిపోయాను.

జూడో, కరాటేల వైపు లీల మనసు వెళ్ళలేదు.

బే ఆఫ్ బెంగాల్ డిప్రెషన్ ప్రభావంతో వర్షాలు, ఈదురు గాలులు.

రాత్రి తొమ్మిది దాటింది. కరెంట్ లేదు. కొవ్వొత్తులు టేబుల్ మధ్యలో పెట్టి పిల్లలిద్దరూ, నేనూ లీలా అన్నం తింటున్నాం. ఒక్కసారి భళ్ళున శబ్దం అయింది.

"శబ్దం వింటే ఏదో గాజు దానిలా ఉంది, ఎక్కడో మరి..."

"అవును, మమ్మీ... ఈ యింట్లోని నూక్ అండ్ కార్నర్ నీకు చాలా బాగా తెలుసు. నీకే తెలుస్తుంది...కదా డాడీ!... అంది మా అమ్మాయి.

గబుక్కున కుర్చీని వెనక్కి తోసి లేచింది లీల, ఏదో గుర్తొచ్చినట్లు.

"అమ్మో! చేపలున్న గ్లాస్ జార్ అయి ఉంటుంది" ఎంగిలి చేత్తోనే విసవిసా నడుస్తూ వెళ్ళింది, చీకటిని లెక్క చెయ్యకుండా.

"టార్చి తీసుకెళ్ళు" అన్నాను.

వెంటనే, దభీమన్న శబ్దం, టీపాయ్ జరిగిన శబ్దం, 'అమ్మ' అన్న శబ్దం క్రమంగా వచ్చాయి. ఒక్కసారి లేచాం. నేను కొవ్వొత్తి తీసుకుని అటువైపు వెళ్ళాను.

"వెధవది, లైటు యిప్పుడే పోవాలా!"అని అంటూండగానే లైటు వచ్చింది. జరిగింది అర్థం అయింది సీను చూసేసరికి.

డ్రాయింగ్ రూంలో మూలన కిటికీ దగ్గరున్న స్టూలుపై ఉన్న గాజు జాడి కింద పడింది.

తెరచాపలా ఎగురుతున్న తెర జరిగిన దానికి నా బాధ్యత ఎంతుందో తెలిసినా "ముందు నన్ను తీయండి..." అంటూ ఏడుపు మొదలెట్టింది.

"మీరు రాకండి... ఆ చేపలు అక్కడ గిలగిలా కొట్టుకుంటున్నాయి అంతా గాజు ముక్కలు... నాకంటే చెప్పులున్నాయి. నేను అమ్మని తీస్తాను..." అంటూ పిల్లలకి సలహా, నా తక్షణ కర్తవ్యం చెప్పాను.

లీలని ముగ్గురం కలిపి మంచంమీదకి చేర్చాం.

నొప్పి, వాపులు, మర్దనాలు, హాట్ ఫోమెంటేషన్.

తగ్గకపోతే... దగ్గర్లో ఉన్న సూపర్ స్పెషాలిటీలో చేర్పించాము.

ఎక్స్‌రేలు మూడుచోట్ల తీసారు. సింపుల్ ఫ్రాక్చర్ రెండుచోట్ల. రెస్ట్, మూడు నెలలు ఆ తర్వాత ఫిజియోథెరపీ, వెంటనే లక్ష రూపాయలకి రెక్కలొచ్చాయి.

ఈ హడావుడిలో ఫెంగుషుయ్‌ని మర్చిపోయింది లీల.

ఇది వాటర్‌లూ అని అనుకోవడానికి వీలుందా! ఆలోచనలో పడ్డాను.

★



రచయిత్రి చిరునామా

గంటి భానుమతి,

ని205, మేఫ్లవర్ పార్క్ అపార్ట్‌మెంట్స్

అన్నపూర్ణ కాలనీ, మల్లాపూర్

హైదరాబాద్...500076

# ఏనుగమ్మ ఏనుగు

ఏనుగు పిల్ల పుట్టిన ఒక గంటలోపే లేచి నడవడం ప్రారంభిస్తుంది. అటూ ఇటూ తిరగకుండా ఒకేచోట ఏనుగు 8 గంటలు అలాగే నిలబడి వుండగలదు. ఏనుగు తొండము 6 అడుగుల వరకూ వుంటుంది. ఏనుగు బాగా వేగం పెంచి మనిషి కంటే ముందు పరుగు పెట్టగలదు. దుఃఖం తట్టుకోలేక చాలా బాధ కలిగినప్పుడో మనిషిలా కన్నీరు కార్చే ఒకే ఒక జంతువు ఏనుగు. పిచ్చి కోపం వస్తే తనను వేధించిన వారిని తరిమి పట్టుకొని చంపివేయగలిగేది కూడా ఏనుగే.

**- పి.వి.రమణకుమార్**

# కవచం

**క**ర్ణుడు కవచ కుండలాలతో పుట్టినట్లు మహాభారతంలో చెప్పబడింది. యుద్ధాలలో కవచాలు ధరించి యుద్ధవీరులు పోరాడుతారు. ఇటువంటి కవచాలను, కత్తిడోలులను పూర్వకాలపు వీరులవి మ్యూజియంలో భద్రపరచి వుంచుతారు. వీటిని నేడు కూడా సాలార్జంగ్ మ్యూజియంలోనూ చూడవచ్చు. 8వ హెన్రీ మహారాజు ధరించిన మొత్తం కవచాన్ని లండన్ టవర్స్‌లో భద్రపరచి వుంచారు. ఇన్ని శతాబ్దాలైనా ఆ కవచం కొత్తదిలా మెరుస్తుంటుంది.